

సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి విజయానంద్

రెండు చోట్ల పారిశ్రామిక పార్కులు

స్వచ్ఛాంధ్ర, వ్యవసాయ, సర్వీసు విభాగాల్లో వెనుకబడ్డ జిల్లా

పరిశ్రమల సెక్టారులో మంచి స్థానం

కలెక్టర్ల సదస్సులో ర్యాంకుల ప్రకటన

చిత్తూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు చోట్ల పారిశ్రామిక పార్కుల్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుండడంతో ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.విజయపురం మండలం కోసలనగరం ప్రాంతాన్ని మల్టీ ప్రోడక్ట్ సెక్టార్‌గా, కుప్పం ప్రాంతాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.ఈ పార్కులకు పెట్టుబడుల్ని ఆకర్షించగలిగితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లాలకు ర్యాంకులు ప్రకటించారు.పలు సెక్టార్లలో మన జిల్లా వెనుకబడినట్లు తేలింది.

జీడీపీ లక్ష్యంలో వెనుకబాటు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన జిల్లా స్థూల ఉత్పత్తి లక్ష్యం రూ.60,013 కోట్లు కాగా తొలి త్రైమాసికంలో 19.43 శాతం అంటే 11,658 కోట్లు సాధించింది.సుమారు 5.5 శాతం వెనుకబడింది.అన్నమయ్య జిల్లా 20.46 శాతంతో మన కంటే ముందుండగా, తిరుపతి జిల్లా 18.55 శాతంతో వెనుకబడింది.

స్వచ్ఛాంధ్రలో 21వ స్థానం

స్వచ్ఛాంధ్ర విభాగంలో జిల్లాకు బీ గ్రేడ్ దక్కింది.స్కోర్ బోర్డులో 61 పాయింట్లు వచ్చాయి. మన జిల్లా 21వ స్థానంలో నిలవగా.. తిరుపతి 60, అన్నమయ్య 59 స్కోరుతో 25, 26 స్థానాల్లో నిలిచాయి. ఇదే విభాగంలో మండలాలకు కూడా ర్యాంకులిచ్చారు. టాప్ 10, బాటమ్ 10 మండలాల జాబితాను విడుదల చేయగా..పాలసముద్రం మండలం 54 స్కోర్‌తో కిందినుంచి 4వ స్థానంలో నిలిచింది.

వ్యవసాయ అనుబంధ విభాగాల్లో ఆఖరు

వ్యవసాయ అనుబంధ విభాగాల్లో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు వరుసగా 24, 25, 26 ర్యాంకులు దక్కాయి. అన్నమయ్య 25, చిత్తూరు 22, తిరుపతి 21 స్కోరుతో సీ గ్రేడ్‌లో ఉన్నాయి.వ్యవసాయ అనుబంధ సెక్టారుకు ఈ ఏడాది రూ.22,050 కోట్ల జీవీఏ లక్ష్యం వుండగా, తొలి త్రైమాసికంలో రూ.3508 కోట్లతో 15.91 శాతం లక్ష్యాన్ని అధిగమించింది. మిగిలిన కాలంలో 84.09 శాతం లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉంది. తిరుపతి 12.61%, అన్నమయ్య 11.07%తో వెనుకబడి ఉన్నాయి.

పరిశ్రమల్లో పురోగతి

పరిశ్రమల సెక్టారులో 70 స్కోరు, బీ గ్రేడుతో చిత్తూరు జిల్లా 11వ స్థానంలో ఉంది. అన్నమయ్య 80 స్కోరు, ఏ గ్రేడుతో 5వ స్థానంలో.. తిరుపతి జిల్లా 54 స్కోరు, బీ గ్రేడుతో 22వ స్థానంలో ఉంది. ఈ సెక్టారులో రూ.10191 కోట్ల జీవీఏ లక్ష్యం కాగా, తొలి క్వార్టర్‌లో రూ.2861 కోట్లతో 28.08 శాతం అధిగమించింది.

సర్వీసు సెక్టారులో చివరి స్థానం

సర్వీసు సెక్టారులో 74 స్కోరుతో చిత్తూరు జిల్లా 23వ స్థానంలో ఉండగా.. తిరుపతి 82 స్కోరుతో 13వ స్థానంలో, అన్నమయ్య 68 స్కోరుతో 26వ స్థానాల్లో ఉన్నాయి. ఈ సెక్టారు ద్వారా రూ.22854 కోట్ల జీవీఏ లక్ష్యంగా ఉండగా.. తొలి త్రైమాసికంలో రూ.4435 కోట్లతో 19.40 శాతం లక్ష్యాన్ని అధిగమించింది.

పాల ఉత్పత్తితో రూ.11,911 కోట్ల జీవీఏ

2024-25 ఏడాదికిగానూ పాల ఉత్పత్తి ద్వారా రూ.11,911 కోట్ల జీవీఏ (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్) జిల్లాకు వచ్చింది.గతేడాది కేవలం పాల ఉత్పత్తి రంగం ఒక్కటే రూ.11,911 కోట్లు జిల్లా జీడీపీకి కాంట్రిబ్యూట్ చేసింది.

టమోటా విషయంలో అలర్ట్‌గా ఉండాలి

టమోటా పంట విషయంలో చిత్తూరు కలెక్టర్‌తో పాటు పంట అధికంగా ఉన్న అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు, కడప జిల్లాల కలెక్టర్లకు సదస్సులో కొన్ని సూచనలు అందాయి. 'మార్కెట్లలో ఇబ్బందికర పరిస్థితులుంటే వెంటనే గుర్తించి టమోటా పంటను ఇతర జిల్లాలకు తరలించాలి. మార్కెట్‌కు ఎంత ఉత్పత్తి వచ్చే అవకాశముందో రాబోయే 7-10 రోజుల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా అంచనా వేయాలి. జిల్లాలో ఉన్న ప్రాసెసింగ్ యూనిట్లను పూర్తి స్థాయిలో వినియోగించాలి. నాసిరకం పంటను చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రాసెసింగ్ యూనిట్లకు తరలించాలి. ఈ క్రాప్ నమోదును వంద శాతం పూర్తి చేయాలి'అని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నేరుగా నిధులు మంజూరు చేయాలి



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్ల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నేరుగా నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్లలో రూ.2.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రత్యేక అధికారులను నియమించి పనుల పురోగతిని పర్యవేక్షించినట్లు చెప్పారు. సబ్‌ప్లాన్ కింద జిల్లాలకు నేరుగా నిధులు సమకూరిస్తే ఓవర్ హెడ్ ట్యాంకు పనులు, తాగునీటి సౌకర్యం వంటి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయగలమన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులకు కూడా నిధులు సమకూర్చాల్సి ఉందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ పెండింగ్ బిల్లులను త్వరలో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. కాగా జిల్లా సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన విధానం, ప్రణాళికలు, కార్యాచరణపై మంగళవారం సదస్సులో కలెక్టర్ వివరించనున్నారు.



వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, పురందేశ్వరి, రఘురామకృష్ణరాజు, అయ్యన్న పాత్రుడు, ఓం బిర్లా, హరివంశ్‌నారాయణ్‌సింగ్, జకియాఖానం, గౌరు చరితారెడ్డి

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

- తిరుపతిలో ముగిసిన రెండు రోజుల సదస్సు
- నేడు స్వస్థలాలకు డెలిగేట్లు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ సాధించాలంటే.. మహిళల ఆర్థిక సాధికారత కీలకం. ఈ దిశగా అడుగులు వేసేలా రెండు రోజులపాటు తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన జాతీయ మహిళా సాధికారత సదస్సు దోహదపడింది. మహిళల ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, ఆర్థికాభివృద్ధి, డిజిటల్ అక్షరాస్యత, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, సైబర్ భద్రత కల్పించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని సదస్సు చర్చించింది. ఈ సదస్సుకు లోక్‌సభ, రాజ్యసభ, 20కిపైగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టసభల సాధికారత కమిటీలకు సంబంధించి 200మందికిపైగా వచ్చారు. తొలిరోజు సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరు కావాల్సి ఉండగా, ప్రతికూల వాతావరణంతో ఆయన పర్యటన రద్దయింది. రెండో రోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొదటి రోజు సదస్సులో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై విడతల వారిగా సభ్యులు చర్చించారు. వాటిపరిష్కారానికి పలు తీర్మానాలు చేశారు. రెండో రోజైన సోమవారం మహిళా సాధికారత కమిటీలు చర్చించిన పలు తీర్మానాలను ఆమోదిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఇక డెలిగేట్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏపీ అసెంబ్లీ, జిల్లా యంత్రాంగం సమష్టిగా కృషి చేసింది. కాగా, దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల నుంచీ మహిళా ప్రతినిధుల బృందాలు వచ్చాయి. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పార్లమెంటరీ మహిళా సాధికారత అధ్యక్షురాలు పురందేశ్వరి ఆయా బృందాల వద్దకెళ్లి యోగక్షేమాలతోపాటు బస, వసతి తదితరాలను గురించి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడించేలా సాధికారత సదస్సు నిర్వహించామని, అందుకు కారణం జిల్లా యంత్రాంగం పాత్ర చాలా కీలకమని స్పీకర్ ప్రశంసించారు. సదస్సు ముగిసిన వెంటనే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. ఉదయం తిరుమల శ్రీవారిని, మధ్యాహ్నం శ్రీకాళహస్తీశ్వరుడిని పలువురు డెలిగేట్లు దర్శించుకున్నారు. తొలిరోజు రాత్రి చంద్రగిరి కోటలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో తిరుపతి కమిషనర్ మౌర్య పర్యవేక్షణలో డెలిగేట్లకు ఆత్మీయవిందు ఇచ్చారు. కాగా, ప్రతినిధులు మంగళవారం ఉదయం వారి స్వస్థలాలకు బయలుదేరి వెళ్లనున్నారు.


రేపట్నుంచి దివ్యాంగ విద్యార్థులకు వైద్య శిబిరాలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు బుధవారం నుంచి మెడికల్ అసెస్మెంట్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ తెలిపారు.దివ్యాంగ విద్యార్థులు ఒక ఫొటో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు. కుప్పం, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల వారికి బుధవారం కుప్పం ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలురు)లో క్యాంపు ఉంటుందని తెలియజేశారు. పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వి.కోట వారికి 18న పలమనేరు విద్యానగర్‌లోని ఎంఆర్‌సీలో క్యాంపు నిర్వహిస్తామన్నారు. పుంగనూరు, చౌడేపల్లె, సదుం, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల వారికి 19న సదుం జడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహించనుండగా, పూతలపట్టు, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె, యాదమరి వారికి ఈనెల 20న తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో క్యాంపులు ఉంటాయన్నారు. చిత్తూరు, గుడిపాల వారికి 21న డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, జీడీనెల్లూరు, పాలసముద్రం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం, పెనుమూరు, వెదురుకుప్పం వారికి 22న జీడీ నెల్లూరులోని ఎంపీపీఎస్‌లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. నింద్ర, నగరి, విజయపురం మండలాల వారికి ఈనెల 23వ తేదీన నగరి ఎస్‌జీఎస్ జడ్పీహెచ్ఎస్ (బాలిక)లో క్యాంపు ఉంటుందని వివరించారు.

1408మంది కొత్త పంతుళ్లు

- డీఎస్సీ విజేతల జాబితా ప్రకటించిన విద్యాశాఖ
- శిక్షణ అనంతరం విధుల్లో చేరనున్న టీచర్లు
- అభ్యంతరాల స్వీకరణకు హెల్ప్‌డెస్క్‌లో అవకాశం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తాజా డీఎస్సీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408మంది (95.26 శాతం) తుది ఎంపిక జాబితాలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది.ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది.దరఖాస్తుల స్వీకరణతో ఈ ఏడాది ఏప్రిల్ 20న మొదలైన ప్రక్రియ పలు దశలు సాగి ఆదివారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1408 అభ్యర్థులు (95.26 శాతం) తుది ఎంపిక జాబితాలో ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించినట్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సోమవారం ప్రకటించింది.ఫైనల్ సెలక్షన్ జాబితాను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌తో పాటు చిత్తూరు డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఎవరికైనా అభ్యంతరాలుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లోని 84989 91250 నెంబరులో సంప్రదించాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. వివిధ కారణాలతో మిగిలిన 70 పోస్టులను వచ్చే ఏడాది నిర్వహించే డీఎస్సీలో భర్తీ చేయనున్నారు. నూతన ఉపాధ్యాయులకు దసరా సెలవుల సమయంలో అంటే 22 నుంచి 29వ తేది వరకు ఎనిమిది రోజులపాటు ట్రైనింగ్ కార్యక్రమం చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తారు. బోధన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు నిజాయితీ, నిబద్ధత, అంకితభావతో సేవలందించేలా వారికి సూచించనున్నారు. ట్రైనింగ్ సమయంలో కౌన్సిలింగ్ నిర్వహించి, ప్లేస్‌మెంట్ ఆర్డర్ (ప్లేస్ ఆఫ్ పోస్టింగ్ ఆర్డర్) జారీ చేయనున్నారు. ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి కాగానే నూతన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంది.



యాజమాన్యాల వారీగా భర్తీ చేసిన పోస్టులు

యాజమాన్యం	నోటిఫైడ్ పోస్టులు	భర్తీ చేసినవి	భర్తీ చేయనివి
ప్రభుత్వ/లోకల్‌బాడీ	1312	1254	58
మున్సిపాలిటీ	64	57	7
మున్సిపల్ కార్పొరేషన్	97	92	5
ట్రైబల్ వెల్ఫేర్/ఆశ్రమ	5	5	0
మొత్తం	1478	1408	70

● సబ్జెక్టులు/పోస్టుల వారీగా...

సబ్జెక్టు/పోస్టు	నోటిఫైడ్ పోస్టులు	భర్తీ చేసినవి	భర్తీ చేయనివి
ఎస్‌ఏ(ఎల్)ఇంగ్లీష్	104	102	2
ఎస్‌ఏ(ఎల్)హిందీ	17	16	1
ఎస్‌ఏ(ఎల్)తెలుగు	33	33	0
ఎస్‌ఏ(ఎల్)ఉర్దూ	4	2	2
ఎస్‌ఏ(ఎల్)తమిళం	1	-	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)బయాలజీ	60	59	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)బయాలజీ (త)	3	2	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)బయాలజీ (ఉ)	1	1	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)మ్యాథమెటిక్స్	28	27	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)మ్యాథమెటిక్స్(త)	2	1	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)మ్యాథమెటిక్స్(ఉ)	1	1	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)పీడీ	86	86	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)ఫిజికల్ సైన్స్	29	29	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)ఫిజికల్ సైన్స్(త)	1	-	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్) సోషియల్ స్టడీస్	118	117	1
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)సోషియల్ (త)	5	5	0
ఎస్‌ఏ(ఎన్‌ఎల్)సోషియల్ (ఉ)	7	5	2
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)	891	885	6
ఎస్జీటీ (తమిళం)	7	5	2
ఎస్జీటీ(ఉర్దూ)	80	32	48
మొత్తం	1478	1408	70



తన తల్లితో వచ్చి బాధ్యతలు తీసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

పోలీసుల్లో వృత్తి నైపుణ్యాలను పెంచుతా

● ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీసుల్లో వృత్తి నైపుణ్యాలను పెంచడానికి ప్రణాళికలు రూపొందిస్తామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.సోమవారం ఉదయం చిత్తూరు ప్రశాంత్ నగర్‌లోని జిల్లా పోలీసు కార్యాలయానికి తల్లితో కలిసి వచ్చి చిత్తూరు జిల్లా 68వ ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.అనంతరం మీడియాతో మాట్లాడారు.జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి కృషి చేస్తానని, మహిళలు, బాలికల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పని చేస్తానని చెప్పారు.తుషార్ డూడి 2018వ బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. గతంలో గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండెంట్‌గా, చింతపల్లె ఏఎస్పీగా, అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్మిన్ ఏఎస్పీగా, కడప, గుంటూరు, గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బాపట్ల ఎస్పీగా ఉంటూ సాధారణ బదిలీల్లో భాగంగా మన జిల్లాకు వచ్చారు.

19న పద్మావతి వర్సిటీలో ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో 19వ తేదీన ఎంబీఏ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. విద్యార్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎంబీఏ విభాగంలో సంప్రదించవచ్చు. సమగ్ర సమాచారం కోసం ఎస్‌పీఎంవీవీ.. వెబ్‌సైట్‌ను చూడవచ్చునని వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది.ప్రధానంగా శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులు చర్చించనున్నారు.

సోమవారోత్సవాలకు పోటెత్తిన భక్తజనం

రామకుప్పం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రామకుప్పం శివార్లలోని వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాల్లో భాగంగా మూడో సోమవారోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారి దర్శనం కోసం భక్తజనం పోటెత్తారు. తెల్లవారుజామున ఆలయ పురోహితులు స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించి, వెండి కవచధారణతో విశేష పుష్పాలంకరణ చేశారు. అనంతరం నెమలి వాహనంపై వళ్ళీ, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవర్లను ఆశీనులను చేసి విశేషపూజలు నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచే ఆలయం వద్దకు రావడం మొదలెట్టిన భక్తులు తొలుత ఈశాన్య దిక్కున గల నాగులపుట్ట వద్ద పూజలు చేసి పాలు, పండ్లు సమర్పించారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతులు అక్కడి రావి, వేప వృక్షాలకు పూజలు చేసి కొమ్మలకు జోలెలు కట్టారు. అనంతరం క్యూలైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. హిందువులతో బాటూ పెద్దసంఖ్యలో ముస్లింలు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.మొక్కులు నెరవేరిన భక్తులు స్వామివారికి ప్రాకారోత్సవాలు నిర్వహించారు.సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పంబవాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగింపుగా వచ్చి కుండకావళ్ళు, పూలకావళ్ళు, నెమలి కావళ్ళు, పీఫుతేర్లు సమర్పించారు. పలువురు భక్తులు దవడలకు శూలాలు, శరీరాలపై సూదులతో నిమ్మకాయలు గుచ్చుకుని వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సీఐ మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో రామకుప్పం ఎస్‌ఐ వెంకటమోహన్, ట్రైనీ ఎస్‌ఐ మధుసూదన్‌లు బందోబస్తు నిర్వహించారు.




ఆలయం ఎదుట భక్తుల కోలాహలం - ప్రాకారోత్సవంలో నెమలి వాహనంలో ఊరేగుతున్న వళ్ళీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



సోమవారోత్సవ శోభలో సుబ్రహ్మణ్యస్వామి

గ్యాలరీల్లో 1.85 లక్షల మంది

- వాహన సేవలు వీక్షించే అవకాశం
- తప్పుడు ప్రచారానికి కౌంటర్ చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు
- టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



తిరుమల, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో 24 నుంచి జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. మాడవీధుల్లోని గ్యాలరీల్లో 1.85 లక్షల మంది భక్తులు కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముందన్నారు. రీఫిల్లింగ్ ద్వారా మరో 15 వేల మందికి కూడా వాహనసేవల దర్శనం లభిస్తుందన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఎస్పీ సుబ్బరాయుడు, విజిలెన్స్ సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులతో సోమవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్మెంట్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా రోజుకు 435 బస్సులు నడుస్తున్నాయని, దీని ద్వారా రోజుకు సుమారు 1.60 లక్షల మంది భక్తులు పికప్, డ్రాప్ సౌకర్యం కల్పించవచ్చన్నారు. ట్రాఫిక్ సమస్యను తగ్గించేలా వీలైంతన వరకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. తిరుపతిలో 23 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. గ్యాలరీల్లోకి చేరుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. 4,200 మంది పోలీసులు, 1,500 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా క్రౌడ్ మూవ్‌మెంట్, రద్దీ పాయింట్లను రియల్ టైం మానిటరింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. సీఎం, రాజ్యాంగపరమైన అధినేతలు, వీఐపీల రాకపోకలకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు వివరించారు. సోషల్ మీడియాలో తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వెంటనే కౌంటర్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీలు, వీఎస్వోలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 16 నుంచి ఎస్వీయూలో యువ తరంగ్

పోస్టర్లు ఆవిష్కరించిన వీసీ, రిజిస్ట్రార్, శాప్ చైర్మన్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, శాప్ చైర్మన్ రవినాయుడు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబరు 16వ తేదీ నుంచి యువతరంగ్-2025 నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎస్వీయూలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, శాప్ చైర్మన్ రవినాయుడు ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ అక్టోబరు 16 నుంచి యూనివర్సిటీ వేదికగా మూడు రోజులు డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులకు అంతర యూనివర్సిటీల సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వక్తృత్వ, సంగీత, నృత్య, థియేటర్ ఆర్ట్స్ వంటి 10 అంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ యువ తరంగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యూనివర్సిటీ సాంస్కృతిక ఔన్నత్యాన్ని పెంపొందించ డానికి ప్రయత్నించాలన్నారు. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ యూనివర్సిటీ క్రీడా, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ 40డిగ్రీ, పీజీ కాలేజీల విద్యార్థులు యువ తరంగ్‌లో పాల్గొంటున్నట్టు చెప్పారు. ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పద్మావతి, మీడియా డీన్ పీసీ వేంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ కో కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. మీ వేషాలు నా దగ్గర కాదు!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కని శానిటేషన్ వర్కర్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంత చదువుకున్నా.. ఎంత పరిజ్ఞానమున్నా సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మేవాళ్లే ఎక్కువ. వాళ్ల ఉచ్చులోపడి లబోదిబోమనే వాళ్లే. కానీ, తిరుపతికి చెందిన శానిటేషన్ వర్కర్ ఒకరు మాత్రం మీ వేషాలు నా దగ్గర కాదంటూ సోమవారం తనకు ఫోనుచేసిన అమ్మాయికి దీటుగా ఎదురు తిరిగారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతికి చెందిన దొరరాజు మధుసూదనరాజు టీటీడీ పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు 87459 85232 నెంబరు నుంచి వాట్సాప్ ఫోను వచ్చింది. వాట్సాప్ పిక్‌గా 'స్కాలర్‌షిప్ డిపార్టుమెంటు' అని ఉంది. మీ కుమారుడు రోహిత్ కుమార్ రాజుకు ప్రభుత్వం స్కాలర్ షిప్ కింద రూ.38,500 మంజూరు చేసిందంటూ ఓ యువతి చెప్పింది. మీకు ఫోనుపే ద్వారా జమ చేశామంటూ స్క్రీన్ షాట్ పెట్టింది. స్క్రీన్ షాట్‌లో ఆ మొత్తం జమ చేసినట్లుగా ఉంది. దీనికిగాను తమకు కమీషను కింద వెంటనే డబ్బు పంపాలని తొందర చేసింది. నీ అకౌంటులో రూ.మూడు వేలు ఉంది కదా.. దానిని పంపండని ఆమె ఒత్తిడి తెచ్చింది. ఈయన మాత్రం తన తన అకౌంటులో బ్యాలెన్సు చెక్ చేయగా, జమ కాలేదని తెలిసింది. మీరు డబ్బు పంపండి.. మళ్ళీ స్కాలర్ షిప్ అమౌంటుతో కలిపి మీకు పంపుతామంటూ ఆమె చెప్పినా ఆయన గట్టిగా నిలదీశారు. దీంతో ఆమె ఫోను స్విచ్ ఆఫ్ చేసింది. ఇలాంటి ఫోన్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

అవగాహనతో ప్రాణాంతక వ్యాధుల నిర్మూలన



తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక వ్యాధులపై అవగాహన ఉన్నప్పుడే పూర్తిగా నిర్మూలించే అవకాశం ఉంటుందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో ఆయన సోమవారం మొబైల్ ఐఈసీ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ లెప్రసీ, టీబీ వ్యాధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎయిడ్స్, లెప్రసీ, టీబీ వ్యాధులకు సంబంధించిన ప్రచార పుస్తకాలు, పత్రికలను ఆవిష్కరించారు. వైద్యాధికారులు శైలజ, కోటిరెడ్డి, సురేంద్ర, మంజునాథ్, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రాధాన్యతతోనే సాధికారత సాకారం

- మహిళా ప్రజాప్రతినిధుల వాణి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మహిళా ప్రజాప్రతినిధులు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ముఖ్యం..ఆర్థికంగా, సామాజికంగా వారికి సమాన హక్కులు కల్పిస్తే ఇది సాధ్యం.. దేశ గమనాన్ని నిర్దేశించే రాజకీయాల్లో భూమిక మరింత పెరగాలి. అప్పుడే భారతావనిలో మహిళా సాధికారత సాకారమవుతుంది. తిరుపతిలో రెండోరోజు(సోమవారం) జరిగిన జాతీయ మహిళా సాధికారత సమావేశంలో పాల్గొన్న పలువురు మహిళా ప్రజాప్రతినిధులు వ్యక్తం చేసిన అభిప్రాయాలివి..వారెమన్నారంటే...

అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలి



రాజకీయంగానే కాకుండా ఇతర రంగాల్లోనూ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు ప్రాధాన్యత కల్పించాలి. ప్రస్తుతం మైనార్టీ మహిళలు కూడా మరింతమంది రాజకీయాల్లోకి రావడం శుభపరిమానం. ఆ దిశగా వారు ముందుకు రావడం అభినందనీయం. ప్రధానమంత్రి మోదీ, సీఎం చంద్రబాబు మహిళలకు అగ్రాసనమేస్తున్నారు. ఇలాంటి సదస్సులు మహిళలు మరింత ముందుకు సాగడానికి ప్రేరణనిస్తాయి.

- జకియాఖానం, ఏపీ శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్

మరిన్ని పథకాలు అవసరం



మహిళల రక్షణ, స్వావలంబనకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు మరిన్ని పథకాలు తేవాలి. విద్యా,ఆర్థిక, నైపుణ్యాభివృద్ధితోనే మహిళా సాధికారత కల సాఫల్యమవుతుంది. చిన్నప్పటి నుంచి విద్య అందించడం, లింగ వివక్షత రూపుమాపడం, సమాన అవకాశాలు కల్పించడం ద్వారా రాజకీయ సామాజిక రంగాల్లో మహిళలు రాణించడానికి వీలవుతుంది. కేరళలో మహిళలు కూడా వందశాతం అక్షరాస్యత సాధించారు.

- శాంతకుమారి, కొంగడ్ ఎమ్మెల్యే, కేరళ

తీర్మానాలు అమలైతేనే సార్థకత



జాతీయ సాధికారత సదస్సులో మహిళాభ్యున్నతికి చేసిన తీర్మానాలను చట్టసభలో కూడా ఆమోదించాలి. వాటిని అమలు చేయాలన్నారు. అపుడే వాటికి సార్థకత లభిస్తుంది. పంచాయతీ నుంచి అసెంబ్లీ వరకు మహిళకు రాజకీయాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. ఆడబిడ్డల భవిష్యత్తుకు ప్రభుత్వాలు మరన్ని చట్టాలు తెవాల్సి ఉంది. ఈ శతాబ్దంలో కూడా మహిళలు తమ సమస్యలపై పోరాడాల్సి వస్తోంది.

- తారహై కుత్‌బ్రెట్, ఎమ్మెల్యే, తమిళనాడు

సదస్సు చరిత్రలో ఓ మైలురాయి



మహిళాభివృద్ధికి తొలిసారిగా జాతీయ మహిళ సాధికారత సదస్సు నిర్వహించడం శుభపరిణామం. ఇది చరిత్రలో ఓ మైలురాయిలా నిలుస్తుంది. కేరళలో మహిళా అభివృద్ధికి అక్కడి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టింది. పురుషులతో పోలిస్తే మహిళ అక్షరాస్యత శాతం కూడా ఎక్కువే. మహిళలు మరింత ఎదగాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి.

- ప్రతిభ, మహిళసాధికారత చైర్‌పర్సన్,కేరళ

మహిళా ఎమ్మెల్యేల సంఖ్యే సాధికారతకు దర్పణం



మహిళలను ఒక శక్తిగా చూడాలన్నది సీఎం చంద్రబాబునాయుడు సంకల్పం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో 22మంది మహిళా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉండటం చంద్రబాబు దార్శనికతకు దర్పణం. ఆర్థికంగా, రాజకీయంగా మహిళలు ఎదిగితేనే సాధికారత సాకారమవుతుంది. ఈ దిశగానే రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది.

- మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఎమ్మెల్యే

సదస్సుతో సాధికారతకు బాట



తొలిజాతీయ మహిళా సాధికారత సదస్సు తిరుపతి కేంద్రంగా నిర్వహించడం గర్వకారణంగా ఉంది. ఈ సదస్సులో చేసిన తీర్మానాలు మహిళాలోకానికి ఎంతగానో ఉపయోపడతాయి. మహిళలకు అధికారం, ఆర్థికంగా ఎదగడానికి సదస్సు బాటలు వేస్తుంది. సదస్సు నిర్వహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు.

- ఎ.మధుసూదన్, ఎమ్మెల్సీ

సూపర్‌సిక్స్‌లో నాలుగు స్త్రీలకే..



మహిళ సాధికారతను కూటమి ప్రభుత్వం ఆచరణ సాధ్యం చేస్తోంది. సీఎం చంద్రబాబు ఈ విషయంలో నిబద్ధతతో పనిచేస్తున్నారు. అందుకు పథకాల్లో మహిళలకే పెద్దపీట వేస్తున్నారు. సూపర్‌సిక్స్‌లో నాలుగు పథకాలు మహిళలకే కేటాయించిన ఘనత చంద్రబాబుకు దక్కింది. సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వడం సంతోషం.

- గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే






సదస్సు గురుతులు: సదస్సుకు హాజరైన డెలిగేట్ల సెల్ఫీ - ఫొటో తీసుకుంటూ - శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహిళా ప్రజాప్రతినిధులు



శ్రీవారి ఆలయంలో నవీన్‌చంద్ర రాంగులామ్ దంపతులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్ తదితరులు

కృతజ్ఞతలు తెలపడానికి వచ్చా

- సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమానికి మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర



మారిషస్ ప్రధాని నవీన్‌చంద్రకు బొట్టు పెడుతున్న గురువానంద

రామచంద్రాపురం,సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): 'సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమ పీఠాధిపతి గురవానంద గురూజీ ఆశీర్వాదంతోనే నేను నాలుగోసారి మారిషస్ ప్రధానినయ్యా. అందుకు కృతజ్ఞతలు తెలపడానికి ఆశ్రమానికి వచ్చా' నని నవీన్‌చంద్ర రాంగులామ్ చెప్పారు రామచంద్రాపురం మండలం సి.రామాపురం సమీపంలోని బ్రహ్మర్షి గురూజీ సిద్ధేశ్వర తీర్థ ఆశ్రమాన్ని సోమవారం మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులాం, వీణా రామ్‌గులాం దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది సెప్టెంబరు 15న మారిషస్‌లో తాను గురువానంద గురూజీని కలవగా, నవంబరు 13లోపు ప్రధానమంత్రి అవుతావని చెప్పారన్నారు. ఆ ప్రకారం కావడంతో ఆశ్రమానికి వచ్చి ఆయన్ను కలిశానని తెలిపారు. నవీనచంద్ర చేపట్టిన ప్రజాసేవకు గుర్తింపుగా ఇప్పటికే నాలుగు పర్యాయాలు మారిషస్ ప్రధానమంత్రి అయ్యారని గురువానంద గురూజీ తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, తెలంగాన రాజ్యసభ సభ్యుడు రవిచంద్రారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులున్నారు. అనంతరం మారిషస్ ప్రధాని దంపతులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరగా జేసీ శుభం బన్సల్, ఆర్డీవో రామ్మోహన్, డీఎస్పీ ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు రాజేష్, శాంతిలాల్, సరళ, ఆసీస్‌మెహతా తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం నవీన్‌చంద్ర దంపతులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

అడవిలో మృతదేహాలపై వీడని మిస్టరీ

హత్య కోణంలోనూ అనుమానాలు ● రెండు గోతుల్లో ఏముందో తేలేది రేపే




మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

పాకాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పనపాకం రిజర్వు ఫారెస్ట్ పరిధిలో ఇద్దరి వ్యక్తుల మృతదేహాల గుర్తింపులో చిక్కుముడి వీడలేదు. ఇక్కడి అడవిలో రెండు మృతదేహాలను ఆదివారం సాయంత్రం గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చిన విషయం తెలిసిందే. సీఐ సుదర్శన్ ప్రసాద్, తహసీల్దార్ సంతోష్ సాయి, సిబ్బంది సోమవారం వెళ్లి పరిశీలించారు. చెట్టుకు వేలాడుతున్న పురుషుడి మృతదేహాన్ని కిందికి దించారు. దీనితోపాటు అక్కడే కిందఉన్న మహిళ మృతదేహానికి సాయంత్రం వైద్యులు అక్కడే పోస్టుమార్టం చేశారు. ఇవి కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటతో అక్కడే ఖననం చేశారు. ఫోరెన్సిక్ క్లూస్ టీమ్ పరిసరాల్లో ఆనవాళ్లు సేకరించింది. కాగా పక్కనే రెండు గోతుల్లో చిన్నారుల మృతదేహాలు ఉన్నాయని భావిస్తున్నారు. గుంతలు తవ్వేందుకు ప్రయత్నించేలోగానే చీకటి పడింది. మంగళవారం తవ్వి పరిశీలించనున్నారు. మృతులు తమిళనాడు తంజావూరుకు చెందిన వారుగా భావిస్తున్నారు. తంజావూరుకు చెందిన కళైసెల్వన్ అనే మానసిక వైద్యుని వద్ద మేలో చికిత్స తీసుకున్న ప్రిస్కిప్షన్ సంఘటనా స్థలంఠ లభించింది. అంతకుమించి ఎలాంటి ఆనవాళ్లు లభించలేదని పోలీసులు తెలిపారు. మహిళ, పురుషుడి నోట్లో గుడ్డలు, గ్లౌజులు కుక్కి, నోటికి ప్లాస్టర్ వేసి ఉంది. ఎక్కడో హత్య చేసి ఇక్కడకు తీసుకొచ్చి చెట్టుకు ఉరివేశారా, ఇక్కడే చంపేశారా అనేది మిస్టరీగా ఉంది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు : 21 దుంగలు స్వాధీనం



మంగళం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టీఎన్‌పాళెం అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. 21 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సాయి గిరిధర్ ఆధ్వర్యంలో విష్ణుకుమార్ బృందం అటవీ సిబ్బంది చైతన్యకిషోర్‌తో కలిసి కూంబింగ్ నిర్వహించారు. టీఎన్‌పాళెం సమీపంలోని షాపింగ్‌మాల్ వెనుక వైపు కొందరు మూడు కార్లలో దుంగలు లోడ్‌చేస్తుండగా వెళ్లారు. వీరిని చూసి వారు చూసి పారిపోగా.. వెంబడించి ఒకరిని పట్టుకున్నారు. అతడు చిత్తూరు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. 19 వేర్లు, రెండు దుంగలను, స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



కాణిపాక ఆలయ ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆస్థాన మండపంలో కళాకారుల నృత్య విన్యాసాలు

నేడు కాణిపాక బ్రహ్మోత్సవ మహా లడ్డూ వేలం



ఆలయ పుష్కరిణిలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఈవో పెంచలకిషోర్, ఈఈ వెంకటనారాయణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో 21 రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలకు గుర్తుగా తయారు చేసిన 21 కిలోల మహా లడ్డూను మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో పెంచలకిషోర్ సోమవారం తెలిపారు. ఆలయ ఆస్థాన మండపంలో మంగళవారం రాత్రి ఈ వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. తెప్పపై మహా లడ్డూను ఉంచుతామని, తెప్పోత్సవం ముగిశాక వేలం జరుగుతుందని తెలియజేశారు.

తెప్పోత్సవానికి పుష్కరిణి సిద్ధం

కాణిపాకంలో మంగళవారం నిర్వహించనున్న తెప్పోత్సవానికి ఆలయ పుష్కరిణిని అధికారులు సోమవారం సాయంత్రం సిద్ధం చేశారు. పుష్కరిణి లోని పాతనీటిని పూర్తిగా తొలగించి, తాజా నీటితో నింపారు. అలాగే తెప్ప ట్రయల్ రన్ నిర్వహించారు. పుష్కరిణిలోనికి ఎంతమంది భక్తులను అనుమతించాలన్న దానిపై పోలీసు శాఖ ఉన్నత అధికారులతో ఈవో పెంచలకిషోర్ చర్చించారు.

పూలంగి సేవలో వరసిద్ధుడి వైభోగం

ఐరాల(కాణిపాకం),సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాలలో సోమవారం రాత్రి వరసిద్ధుడికి పూలంగి సేవను వైభవంగా నిర్వహించారు. వేలూరుకు చెందిన రాజమాణిక్యం నాయుడి జ్ఞాపకార్థం వారి కుమారులు, కాణిపాకానికి చెందిన రాధాకృష్ణన్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించాక స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో తయారు చేసిన భారీ గజ మాలలతో,పుష్పగరిగ కిరీటాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.రాత్రి పూలంగి సేవను పురస్కరించుకొని సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లను అలంకార మండపం వద్ద ఉన్న కల్యాణ వేదికపై వుంచి అర్చకులు స్వామికి ఏక, నక్షత్ర, పంచ, కుంభ, రథ హారతితో పూజలు నిర్వహించారు.హారతి సమయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం ప్రత్యేక ఉత్సవాల్లో అలసి పోయిన స్వామి వారిని సేద తీర్చడానికి ఊంజల్ సేవ నిర్వహించారు.అనంతరం పూలంగి సేవలో భాగంగా సోమవారం రాత్రి వరసిద్ధుడికి ఆలయంలో ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రధాన ఆలయంలోని ప్రాకారంలో మూడు ప్రదక్షిణలు నిర్వహించారు.అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలో భక్తిశ్రద్ధలతో నిలిపారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీకృష్ణారెడ్డి,సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి,ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు,చిట్టిబాబు పాల్గొన్నారు.మంగళవారం రాత్రి నిర్వహించే తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.



‘తోతాపురి’ కిలోకు రూ.8 ఇచ్చేలా చూడండి

- ప్రభుత్వ ఆదేశాలను పాటించని గుజ్జు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి
- మామిడి రైతుల సంక్షేమ సంఘం డిమాండ్
- కలెక్టరేట్‌లో జరిగిన ‘పీజీఆర్ఎస్’కు వచ్చిన అర్జీలు 339

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కిలోకు ప్రభుత్వం ప్రకటించిన రూ.8 ధరను మామిడి గుజ్జు పరిశ్రమలు ఇచ్చేలా చూడాలని మామిడి రైతుల సంక్షేమ సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్)లో జేసీ విద్యాధరికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలను పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకటించిన ధర ఇవ్వకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆ సమయంలో అక్కడున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. కొన్ని పరిశ్రమలు కిలోకు రూ.6 మరికొన్ని రూ.8 ఇస్తున్నాయనడంతో.. ఆయన మాటలు అర్థం కాలేదని రైతులు, నేతలు కేకలు వేశారు. అందుకాయన రైతుల కోసం ప్రభుత్వం మాట్లాడుతోందని.. చెప్పడంతో అక్కడినుంచి అందరూ బయటకు వచ్చేశారు. బాధితుల నుంచి జేసీతోపాటు ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్, డీఆర్వో మోహన్ కుమార్, డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కుసుమ కుమారి, వివిధ శాఖల అధికారులు అర్జీలను స్వీకరించారు. మొత్తం 339 అర్జీలు అందాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 261, పోలీసుశాఖకు 12, పంచాయతీ రాజ్‌కు 5, స్టాంపులశాఖకు 5, విద్యాశాఖకు 4, ఐసీడీఎస్‌కు 2, డ్వామాకు 3, పౌరసరఫరాల శాఖకు 5, డీఆర్‌డీఏకు 24, పశు సంవర్థకశాఖకు 4, మున్సిపాలిటీ, గ్రామీణ నీటిపారుదలశాఖ, హార్టికల్చర్ శాఖలకు 14 అర్జీల చొప్పున ఉన్నాయి.

ప్రధాన అర్జీల్లో కొన్ని..

- ఎస్ఎస్‌కొండ నుంచి కుప్పనపల్లె గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు ఉండటంతో వర్షం వస్తే నడవడానికి కూడా వీల్లేకుండా ఉందని స్థానికులు తెలిపారు. ఈ దారిలో సిమెంటు వెంటనే వేయాలని యువరాజ్ ఆధ్వర్యంలో విన్నవించారు.
- తనకున్న కొద్దిపాటి భూమిని లాక్కున్నారని నగరి మండలం ఏకాంబరకుప్పంకు చెందిన దివ్యాంగురాలు దేవకి ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబరు 245, 261లో ఉన్న తన భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని తెలిపారు. అడిగితే బెదిరిస్తున్నాడని వాపోయారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.
- సర్వే నెంబరు 154-8బిలో 1.5 సెంట్ల భూమిని ప్రభుత్వం తన తల్లి పేరుపై మంజూరు చేసిందని కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీపేటకు చెందిన దివ్యాంగుడు మోహన్ తెలిపారు. ఈ స్థలాన్ని సర్వే చేసి ఇవ్వాలని పలుమార్లు కోరినా స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరాడు.
- తన అనుభవంలో ఉన్న భూమికి పట్టాదార్‌పాసుపుస్తకాన్ని మంజూరు చేయాలని చౌడేపల్లె మండలం రామయ్యగట్టుకు చెందిన సుబ్బులమ్మ కోరారు. 60 ఏళ్లుగా తమ అనుభవంలోని మూడెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి, న్యాయం చేయాలని విన్నవించారు.
- అటవీ ప్రాంతానికి వెళ్లేదారిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమల మండలం అన్నెమ్మగారిపల్లె పంచాయతీకి చెందిన రైతులు కోరారు. ఒకరిద్దరు రైతులు ఆవులను తోలుకెళ్లినా అడ్డగిస్తున్నారన్నారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఈ అంశంపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి పేరుతో నిర్వహించిన బైక్‌జాతా పలమనేరు నుంచి బయల్దేరి సోమవారం చిత్తూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు నాయకులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. విఠపు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యారంగంలో చేసిన ప్రయోగాలు దుష్పరిణామాలకు దారితీశాయని, వాటిని సరిదిద్దాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా, ఇప్పటి వరకు పీఆర్‌సీకి సంబంధించి పురోగతి లేదన్నారు. 29శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జీవీ రమణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నుంచి నాలుగు విడతలుగా కరువు భత్యం పెండింగ్‌లో ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి ఆర్థిక పరమైన అంశాలు పెండింగ్‌లో లేకుండా చూడాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప, రెహానాబేగం, ప్రసన్న, ఎస్‌పీ బాషా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై విన్యాసం చేస్తూ ప్రాణం మీదకు తెచ్చుకున్న యువకుడు



గాయపడిన ఇంద్రీష్

పుంగనూరు, సెప్టెం బరు 15 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఓ యువకుడు ద్విచక్ర వాహనాన్ని పైకిలేపి విన్యాసాలు చేస్తూ వెనుకకు బోల్తా పడి ప్రాణం మీదకు తెచ్చుకున్న సంఘటన సోమవారం పుంగనూరులో జరిగింది. స్థానిక ఎన్ఎస్‌పేటకు చెందిన రియాజ్ కుమారుడు ఇంద్రీష్ (20) ముగ్గురు స్నేహితులతో కలిసి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు వద్దకు మోటారు సైకిళ్లలో వెళ్లారు. అక్కడ ఇంద్రీష్ బైక్ ముందు చక్రాన్ని పైకిలేపి విన్యాసం చేస్తున్న సమయంలో అదుపుతప్పి వెనుకకు పడింది. దీంతో ఇంద్రీష్ తలకు తీవ్ర గాయం కావడంతో భయపడ్డ ఇద్దరు స్నేహితులు పరారయ్యారు. మరో స్నేహితుడు మోటారుసైకిల్‌పై ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు చికిత్స చేసి తలకు తీవ్రగాయం ఉండటంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సూచించడంతో కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

జూడాలపై దాడి ఘటనలో నిందితుడికి రిమాండ్



మొగిలీశ్వర్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్, సెప్టెం బరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో జూనియర్ డాక్టర్ల (జూడాల)పై దాడిచేసిన ఘటనలో ఓ నిందితుడిని సోమవారం రెండో పట్టణ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రెండ్రోజుల కిందట ఆస్పత్రికి వెళ్లిన కొంతమంది యువకులు తమకు త్వరగా చికిత్స చేయాలంటూ డ్యూటీ డాక్టర్లతో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి డాక్టర్లపై ఆ యువకులు దాడికి పాల్పడ్డారు. డాక్టర్ల ఫిర్యాదుతో ఆరుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఏ1గా ఉన్న మొగిలీశ్వర్‌ను సోమవారం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

కృష్ణాపురం వద్ద రెండు నెమళ్లు మృతి





పుంగనూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ సమీపంలోని కృష్ణాపురం వద్ద రెండు నెమళ్లు మృతి చెందిన విషయం సోమవారం వెలుగుచూసింది. స్థానిక కోనేరు వెనుక ప్రాంతంలోని మంగళం గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి టమోటా పొలంలో నెమళ్లు క్రిమిసంహారక మందులు కలిసిన పదార్థాలను తిని మృతి చెంది ఉంటాయని గ్రామస్తులు అంటున్నారు. విషయం తెలియగానే పుంగనూరు ఫారెస్టు అధికారులు సంఘటన ప్రాంతానికి వెళ్లి విచారించి, చనిపోయిన రెండు నెమళ్లను ఎఫ్ఆర్‌వో కార్యాలయానికి తీసుకొచ్చారు. మంగళవారం పశువైద్యులతో పోస్టుమార్టం చేయించి నెమళ్ల మృతికి కారణాలు తెలుసుకుంటామని అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ శివరంజని చెప్పారు.

ఇన్‌స్టాగ్రామ్ చూడొద్దన్నందుకు టెన్త్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పుంగనూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మొబైల్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ చూస్తూ సరిగా చదవడంలేదని కుటుంబీకులు మందలించినందుకు మనస్తాపంతో సోమవారం ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు.. పుంగనూరుకు చెందిన ఓ పదోతరగతి విద్యార్థిని సరిగా చదవడంలేదని స్థానిక జగనన్నకాలనీలోని మేనత్త ఇంటిలో రెండు నెలల క్రితం వదలడంతో రోజూ జడ్పీ హైస్కూల్‌కు వెళ్లి వస్తోంది.పొద్దుపోయేవరకు మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండడం, ఇంటిలో పనులు చేయకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చూడొద్దని మందలించారు.దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంటిలో ఉన్న ఎలుకల మందు తాగి స్కూల్‌కు బయలుదేరింది.మార్గమధ్యంలో అపస్మారకస్థితిలో ఆమెను గమనించిన వారు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పుంగనూరు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా కోలుకుంది.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

- రూ.40.36 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ ప్రభాకర్, సీఐలు

పలమనేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పలమనేరులో టీడీపీ నాయకుడు రామ్మూర్తి నాయుడి ఇంటిలో చోరీకి పాల్పడిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు.ఆగస్టు 31వ తేది రాత్రి రాధాబంగ్లా ఏరియాలో నివాసమున్న రామ్మూర్తి నాయుడి ఇంట్లో చోరీ జరిగింది. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా చోరీకి పాల్పడిన తూర్పు గోదావరి జిల్లా అచ్యుతాపురానికి చెందిన అడపాల వెంకటశివను పలమనేరు సమీపంలో సోమవారం మధ్యాహ్నం పట్టుకొన్నారు. అతడి వద్ద నుంచి చోరీ చేసిన రూ.40.36 లక్షల విలువ చేసే 543 గ్రాముల బంగారు నగలు, 336 గ్రాముల వెండి స్వాధీనం చేసుకొన్నారు. సీఐ మురళీకృష్ణ, జిల్లా క్రైం ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, ఏఎస్ఐ దేవరాజులురెడ్డి,సబ్‌డివిజన్ క్రైంపార్టీ ఏఎస్ఐ శ్రీనివాసులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితుడిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండు నిమిత్తం చిత్తూరుకు తరలించినట్టు చెప్పారు.

19న మెగా ఉద్యోగ మేళా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 19వ తేదీన మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం మూడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, ఎంకాం, పీజీ, డీ, బీ ఫార్మసీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుంచి రూ.27వేల వరకు జీతం ఉంటుందని వివరించారు.

మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ ధ్యేయం

- రేపటినుంచి వైద్య శిబిరాలు: డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసమే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ధ్యేయమని డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను ఆవిష్కరించారు. బుధవారం నుంచి అక్టోబరు రెండో తేదీవరకు జిల్లా వ్యాప్తంగా 50 పీహెచ్‌సీలో, 15 యూపీహెచ్‌సీలో, 437 విలేజ్ క్లినిక్‌లో, 5 సీహెచ్‌సీ, 3 ఏరియా, 2 స్పెషలిస్ట్ క్యాన్స్ ద్వారా 538 వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యపరీక్షలు, ఎన్‌సీడీ స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్, అభా ఐడీ నమోదు, పీఎంజేఐవై, పీఎంఎంవీవైల పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థిని తలపగలకొట్టిన టీచర్

పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలింపు

పుంగనూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు స్కూల్ టీచర్ ఆగ్రహంతో ఆరవ తరగతి విద్యార్థిని తల పగులకొట్టినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు .. పుంగనూరు కొత్తపేటకు చెందిన పీసీ.హరికుమార్ కుమార్తె పి.సాత్విక నాగశ్రీ స్థానిక తాటిమాకులపాళ్యంలోగల భాష్యం పాఠశాలలో ఆరవ తరగతి చదువుతోంది. తండ్రి మృతి చెందగా తల్లి విజేత అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. పుంగనూరుకు చెందిన ఎస్.సలీం బాషా హిందీ టీచరుగా పనిచేస్తూ ఈనెల 10వ తేది మొదటి పీరియడ్‌లో సాత్వికనాగశ్రీని పిలిచి పక్కనే ఉన్న క్యారియర్‌బ్యాగ్‌తో తలపై కొట్టాడు. తలలో ఎముక విరగడంతో ఆమెకు ఫిట్స్ వచ్చాయి. ఈ విషయాన్ని ఆమె తల్లికి సలీంబాషా చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బెంగళూరు సెయింట్‌జాన్స్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి ఈ విషయంపై విజేత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంటలపై ఆగని గజ దాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన కొబ్బరిచెట్టు

కల్లూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని కల్లూరు పంచాయతీలో ఆదివారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు దాడులు చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. ముందుగా ఆదివారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 10 ఏనుగుల గుంపు కల్లూరు - గంటావారిపల్లి రోడ్డును దాటుకున్నాయి. రోడ్డుకిరువైపులా ఉన్న కలబందలను ధ్వంసం చేస్తూ పొలాల్లోకి చొరబడ్డాయి. కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలోని రైతులు కోదండ, ధనంజయకు చెందిన కొబ్బరి, జామ, మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు ఇనుపగేటును విరిచేశాయి. కల్లూరులోని రైతులు రషీద్, మల్లికార్జున్, మహబూబ్‌బాషా, ఖాదర్‌బాషా, దేవేంద్రకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. పశుగ్రాసాన్ని తినేశాయి. అనంతరం అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు పెద్దవంక వద్ద తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు.

ఇళయరాజాకు రోజా అభినందనలు



కుటుంబీకులతో కలిసి ఇళయరాజాను అభినందిస్తున్న మాజీ మంత్రి రోజా

నింద్ర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సినీ సంగీత దర్శకుడు ఇళయరాజాను మాజీ మంత్రి రోజా అభినందించారు. 50 ఏళ్ల సంగీత ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ను స్వగృహంలో సోమవారం తన కుటుంబీకులతో వెళ్లి సత్కరించి, అభినందనలు తెలిపారు. తమ చిత్రరంగ ప్రవేశం ఇళయరాజా సంగీతంతోనే ప్రారంభమైందని రోజా, సెల్వమణి దంపతులు గుర్తు చేసుకున్నారు. ఇళయరాజా గోల్డెన్ హ్యాండ్ వల్లే తాము ఇంతగా ఎదిగామని సంతోషం వ్యక్తం చేశారు. రోజా కుమారుడు కృష్ణకౌశిక్‌ను ఈ సందర్భంగా ఇళయరాజా ఆశీర్వదించారు.

ఎమ్మెల్యేచే నూతన అంబులెన్స్ ప్రారంభం


పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో నూతన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వాస్పత్రికి ప్రభుత్వం అందజేసిన అధునాతన అంబులెన్స్‌ను సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నందున నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతుంటాయని, ఇందుకోసం రూ.37 లక్షల వ్యయంతో అధునాతన సౌకర్యాలు కలిగిన అంబులెన్స్‌ను ప్రభుత్వం అందజేసిందన్నారు. ఈ అంబులెన్స్‌లో అత్యవసర చికిత్సలకు కావలసిన అన్ని పరికరాలు, మందులు అందుబాటులో ఉంటాయని, అందుచేత ప్రమాద స్థలం నుంచి అంబులెన్స్‌లోకి ఎక్కిన క్షతగాత్రులను ప్రాణాపాయం నుంచి కాపాడే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం ఆసుపత్రిలోని పలువార్డులను ఆయన పరిశీలించి, అక్కడ అందుతున్న వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, సుధాకర్, భవ్యహెల్త్ సర్వీసు నిర్వాహకులు ఆర్.వి.బాలాజి, టీడీపీ నాయకులు ఆలకుప్పంరాజన్న, ఆర్.బీసీ కుట్టి, సుబ్రహ్మణ్యంగౌడు, చాంద్‌బాషా, మదన్‌మోహన్, శ్రీధర్, బీఆర్‌సీ కుమార్, శ్రీనివాసులు, చిన్ని, లోకేష్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన డీఎస్సీ అభ్యర్థులు

డీఎస్సీ-2025లో స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్‌లో ఎంపికైన పలమనేరు పరిసర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు మోహనలక్ష్మి, లత, ఉష, పునీత, ఆశ, రంగనాథ్, మస్తాన్, భువనేశ్వరరెడ్డి సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ● 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్రం విడుదల చేసిన మెమో 57 వర్తింపజేయాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. పలమనేరు నియోజకవర్గ బాధ్యులు దోర్నాదుల సిద్దార్థ, జి.గురునాథం, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్లు కె.ఆర్.శ్రీధర్, రవికుమార్, సుదర్శనాచారి, మురళి, నిరూప, శ్వేత, జరీనాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



పలమనేరులో రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

పలమనేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడిచినా విద్యారంగ, ఆర్థిక సమస్యలు అపరిష్కృతంగా ఉండటం సరికాదని, వీటిని తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమోజు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. పలమనేరులో సోమవారం నిర్వహించిన యూటీఎఫ్ రణభేరి ప్రచార జాత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తగ్గించి బోధనేతర పనులనుంచి విముక్తి కలిగించాలని డిమాండు చేశారు. అనంతరం పలమనేరు పురవీధుల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.ఎస్.నాయుడు, జి.వి.రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, నాయకులు రెడ్డెప్పనాయుడు, రెహనాబేగం, ఏకాంబరం, పార్థసారథి, ఎస్.పి.బాషా, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తో పరిశుభ్ర కుప్పం


పెయింట్ ఎ వాల్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్

కుప్పం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తో పరిశుభ్ర కుప్పం రూపొందడంతోపాటు, మున్సిపాలిటీకి తగు ఆదాయం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కమిషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. కుప్పం పురపాలక సంఘంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై రెండు రోజుల అవగాహన కార్యక్రమాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఇందులో భాగంగా నిర్వహించిన పెయింట్ ఎ వాల్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు గోడలపై విద్యార్థులు పెయింట్ చేసి తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం కుప్పంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్లు జిమ్ దాము, సోము తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి


మహమ్మద్‌గౌస్‌పీర్ మృతదేహం

రొంపిచెర్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ సుబ్బారెడ్డి ఇచ్చిన వివరాల మేరకు.. సోమవారం అన్నమయ్య జిల్లా పీలేరు మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన విజయ్‌కుమార్ భార్య రాజేశ్వరితో పీలేరు నుంచి తిరుపతి వైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా, అదేమార్గంలో చిత్తూరు జిల్లా రొంపిచెర్ల పట్టణం లక్ష్మీనారాయణకాలనీకి చెందిన షేక్ సాయపీర్ కుమారుడు ఎంఎస్ మహమ్మద్ గౌస్‌పీర్ (38) తన ద్విచక్రవాహనంపై రాంగ్ రూట్లో ఎదురుగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్, రాజేశ్వరి, మహమ్మద్‌గౌస్‌పీర్‌లకు గాయాలయ్యాయి. పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి వీరిని తీసుకెళ్లి చికిత్సలు చేశారు. మహమ్మద్‌గౌస్‌పీర్ తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాస్పత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేస్తుండగా మృతి చెందాడు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహమ్మద్‌గౌస్‌పీర్‌కు భార్య సహనాజ్, కుమార్తెలు షమీరా, తస్లీమ్ ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ హుండీలో చోరీ


చౌడేపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ జరిగిన సంఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం వెలుగు చూసింది. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీలోని గాండ్లపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు హుండీని ధ్వంసంచేసి నగదును చోరీ చేశారు. ఈ విషయంపై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



వి.కోట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును ఆ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్, నేతలు సోమవారం విజయవాడ ఆటోనగర్‌లోని ఆయన కార్యాలయంలో కలసి సన్మానించారు. అలాగే విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడిని కలసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు హరినాథరెడ్డి, నారాయణస్వామి, నేతలు విశ్వేశ్వరరావు, శ్రీనివాసులు ఉన్నారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన తులసీనాథ్



కుప్పం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరుగుతున్న జాతీయ మహిళా సాధికార సదస్సుకు విచ్చేసిన భారతీయ జనతా పార్టీ ఎంపీ పురందేశ్వరిని సోమవారం కుప్పం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎన్.ఎస్.తులసీనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువతో సత్కరించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు.

బోయకొండ దసరా ఉత్సవాలకు ఆహ్వానం



చౌడేపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ దసరా మహోత్సవాలకు జాయింట్ కలెక్టర్ విద్యాధరికి ఈవో ఏకాంబరం ఆహ్వానం పలికారు. సోమవారం ఆయన చిత్తూరులో జేసీని కలిసి ఆహ్వాన బుక్ లెట్ అందించారు. డీఎఫ్‌వో భరణి, పలమనేరు ఆర్డీవో భవాని తదితరులకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్సీ


కేంద్ర మంత్రి రామ్మోహన్‌తో గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడిని ఆదివారం శ్రీకాకుళంలోని తన నివాసంలో టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి తిరుమల తిరుపతి ప్రసాదాన్ని అందించారు. కుప్పం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కోరగా, ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విధంగానే ఈ సంవత్సరం డిసెంబరులో కుప్పం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తామని చెప్పినట్లు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చౌడేపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాలను తిరుపతి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీరామాంజనేయులురెడ్డి, గురుప్రసాద్ తనిఖీ నిర్వహించారు. సోమవారం స్థానిక పుడమి కిసాన్ మార్ట్, గ్రోమోర్ సెంటర్ లలో ఎరువుల విక్రయాలు, స్టాక్ నిల్వలను తనిఖీ నిర్వహించారు. రైతులకు ఫోన్ చేసి యూరియా అందిందా లేదా అనే వివరాలను సైతం తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా సరఫరా చేయాలని, అధిక ధరలకు విక్రయించినా, బ్లాక్ మార్కెటింగ్ చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

బాలిక అదృశ్యంపై కేసు నమోదు


దివ్యశ్రీ (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అమినిగుంట పంచాయతీ బూరగపల్లెకు చెందిన సురేష్ కుమార్తె దివ్యశ్రీ(13) ఈనెల 10వ తేది మధ్యాహ్నం నుంచి కనిపించటం లేదన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దసరా ఉత్సవాలకు నాగబాబుకు ఆహ్వానం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం చదళ్లలో వెలసిన చౌడేశ్వరిదేవి దసరా ఉత్సవాలకు రావాల్సిందిగా ఎంఎల్‌సీ కొణిదల నాగబాబును ఆలయ చైర్మన్, జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి ఆహ్వానించారు. సోమవారం విజయవాడలో జనసేన పార్టీ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు, జనసేన పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌లను కలిసి వారికి పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువలతో సత్కరించి ఉత్సవాలకు తప్పకుండా హాజరుకావాల్సిందిగా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. జనసేన నాయకులు శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పొలానికి దారి ఏర్పాటు చేయించినందుకు దాడి


చికిత్స పొందుతున్న రామకృష్ణ

పుంగనూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం మంగళం వద్ద తమ పొలాలకు వెళ్లే దారిని కొందరు మూయించగా అధికారుల ద్వారా మళ్లీ ఏర్పాటు చేయించానని తనపై దారి ఆక్రమించిన వ్యక్తులు దాడి చేశారని రామకృష్ణ అనే రైతు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు వివరాలు.. పుంగనూరు మండలం బోడినాయునిపల్లెకి చెందిన పి.గంగులప్ప కుమారుడు రామకృష్ణతోబాటు లోకనాథం, బాలసుబ్రహ్మణ్యం తదితరులకు మంగళం వద్ద వ్యవసాయ భూములున్నాయి. ఎకన్నయ్య, బాబు పూర్వంనుంచి ఉన్న బండిబాట దారిని వీరి పొలాల్లోకి కలిపేసుకుని దారి మూసివేశారు. దీనిపై తహసీల్దార్, కలెక్టర్, పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో మళ్లీ తమ పొలాలకు వెళ్లేందుకు దారి కల్పించగా.. కన్నయ్య, బాబు తనపై కక్ష పెట్టుకున్నారన్నారు. సోమవారం తమ పొలానికి మట్టి వేయిస్తుండగా కర్రలతో కొట్టి దాడి చేశారని బాధితుడు రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసి, చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రిలో చేరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీల్లో చరిత్ర సృష్టించిన చంద్రబాబు

● **14 డీఎస్సీలు 1,96,619 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ**

శాంతిపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక భాగం డీఎస్సీలు నిర్వహించి దేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చరిత్ర సృష్టించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విడిపోయిన నవ్యాంధ్రప్రదేశ్‌కు ఎంతో మంది ముఖ్యమంత్రులు అయ్యారని, వారెవరూ చేయలేని పనిని ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సాహసంతో కూడిన 14 మెగా డీఎస్సీలు నిర్వహించి 1,96,619 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ బడులకు వెలుగు తెచ్చిన ఘనత మంత్రి నారా లోకేష్‌దన్నారు. యువత బాగుపడడం ఇష్టంలేక మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మెగా డీఎస్సీని ఆపడానికి తనపార్టీ నాయకుల, సానుభూతిపరులు, అభిమానులతో 24 కేసులు వేయించారని ఆరోపించారు. ఇంత దగా చేసిన జగన్‌కు ఉద్యోగ, ఉపాధ్యాయులు, ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా ఇప్పటి ఆయనకు బుద్ధిరాలేదన్నారు. ఇలాగే తప్పుడు ప్రచారాలు చేస్తుంటే 2029 నాటికి వైసీపీని మరింత పాతాళానికి ప్రజలు తొక్కేయడం ఖాయమన్నారు.

టీడీపీ హయాంలోనే అత్యధిక శాతం టీచర్ల భర్తీ

● **ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**


సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులని, భావితరాలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. గంగవరంలో సోమవారం పలమనేరు, గంగవరం మండలాల ఉపాధ్యాయుల గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ... భవిష్యత్ తరాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది కాబట్టే, కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు సముచిత స్థానం కల్పిస్తూ, మెగా డీఎస్సీ నిర్వహించి అత్యధిక పోస్టులు మంజూరు చేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు, త్వరలో పదవీ విరమణ చెందబోతున్న ఉపాధ్యాయులకు జ్ఞాపికతో పాటు దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి అభినందించారు. గంగవరం, పలమనేరు ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, లీలారాణి, బాలసుందరం, సీనియర్ ఉపాధ్యాయులు తులసీనాథం నాయుడు, లక్ష్మీనారాయణ, సుదర్శనాచారి, బాలకృష్ణ, కుబేరనాయుడు, సాలెహ, భాస్కర్, ఏఎంసీ చైర్మన్ రాజన్న, సోమశేఖర్‌గౌడ్, నాగరాజురెడ్డి, గణేష్, గిరిధర్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్


పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

శాంతిపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. శాంతిపురం మండల సచివాలయం వెనుక వైపు ఉన్న టైలర్ స్కూల్ మైదానంలో సోమవారం విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్సీ కంచర్ల ప్రారంభించి, విద్యార్థులతో కరచాలనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్య ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. స్కూల్ గేమ్స్‌కు మెమెంటోలు అందించిన శాంతిపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు బృందాన్ని ఎమ్మెల్సీ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ విభాగంలో అండర్-14, 17 బాల, బాలికలకు పరుగు పందెం, డిస్క్‌త్రో, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సెల్వపాండియన్, చంద్రమ్మ, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో పీఆర్ కుమార్, ఎస్‌ఐ నరేష్, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, సింగిల్ విండో చైర్మన్ గోపాల్, నేతలు ఉదయకుమార్, విజయరామిరెడ్డి, పీవీ నాగరాజు, పెద్దన్న, బసవరాజు, చలపతి, శ్యామల, చంద్రకళ, హరినాథరెడ్డి, రాజేంద్ర, చంద్రశేఖర్, ఆర్ఎస్ మణి, గిరిధర్, బాలు, జయారెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు ఈడిగ శివశంకర్, క్యాబేజీ మురళీ, డాక్టర్ మురుగేష్, సుగుణమ్మ, పీడీలు, పీఈటీలు డిల్లీబాబు, విజయలక్ష్మి, సమీమ్, మునికృష్ణనాయక్, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నేతలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర అమోఘం


సత్కారం అందుకున్న అధ్యాపకులతో బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర అమోఘమైనదని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సెక్రటరీ సాగర్‌రాజ్‌లు అన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ సర్ ఎం.విశ్వేశ్వరయ్య త్యాగాలు, కృషి, దేశాభివృద్ధికి ఆయన చేసిన నిరంతర సేవ ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం విశిష్ట బోధన, శాస్త్రీయ పత్రాలు, పేటెంట్లు, ఆర్‌అండ్‌డీ రంగంలో సాధించిన విజయాలకు గుర్తింపుగా అధ్యాపకులను ఘనంగా సన్మానించింది. విద్య, పరిశోధన రంగాలలో ప్రతిభ కనబరిచిన అధ్యాపకులను రూ.2 లక్షలు విలువైన నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలు, శాలువలతో సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్ బాబు, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ కోదండరామయ్య, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల నిరసన



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): యూరియా సక్రమంగా పంపిణీ చేయడంలేదని ఆరోపిస్తూ బైరెడ్డిపల్లెలో సోమవారం రైతుభరోసాకేంద్రం ఎదుట రహదారిపై బైఠాయించి రైతులు కొంతసేపు నిరసన తెలిపారు. వారంరోజులనుంచి తిరుగుతున్నా యూరియా ఇంతవరకు అందలేదని వారుఆరోపించారు. ఇప్పటికైనా యూరియా సకాలంలో అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌చేశారు. దీంతో బైరెడ్డిపల్లె పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం రైతుభరోసాకేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ జరిగేలా పర్యవేక్షించారు.

ఆశాజనకంగా పట్టుగూళ్ల ధరలు


పలమనేరు ప్రభుత్వ మార్కెట్‌కు సోమవారం వచ్చిన పట్టుగూళ్లు


పలమనేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్‌లో సోమవారం పట్టుగూళ్లు కిలో అత్యధికంగా రూ.722 ధరపలికింది. గత రెండు నెలలుగా పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయని పట్టురైతులు చెబుతున్నారు. పలమనేరుమార్కెట్ కంటె కుప్పం, కర్ణాటకలోని కోలారు, సిద్దగట్ట, విజయపురం, రాంనగర్ మార్కెట్‌లలో పట్టుగూళ్ల ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయని పట్టు రైతులు తెలిపారు. పలమనేరు మార్కెట్‌కు పొరుగు మార్కెట్‌లకు కనీసం కిలోకు రూ.40నుంచి రూ.80వరకు తేడాలు ఉంటోందని, ప్రభుత్వ అధికారులు స్పందించి ఇక్కడ కూడా అదే ధరలు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టురైతులు కోరుతున్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ వి.కోట సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. సోమవారం ఉదయం లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ తమీంఖాన్ నేతృత్వంలో ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందించారు. ఈ నెలలో జన్మదినం జరుపుకుంటున్న సభ్యుల పేరిట ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఎం నాగభూషణం, పీఎస్‌టీ సభ్యులు ఇంద్రేష్‌యాదవ్, సయ్యద్‌సాదాత్, దామోదర్‌రెడ్డి, తుకారాం, గిరిధర్, నాగరాజ్, లక్ష్మణ్, వేణుగోపాల్, తీర్థకర్, మొగిలీశ్వర్, పునిత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అర్జీల వెల్లువ


అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పలమనేరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం డివిజన్ పరిధిలోని పలు మండలాల నుంచి వచ్చిన రైతులు రెవెన్యూ సమస్యలపై ఆర్డీవో పి.భవానికి అర్జీలు సమర్పించారు. ఇందులో భూరీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల్లో పొరబాట్లు, దారిసమస్యలు, ఆర్‌వోఆర్‌లో పొరబాట్లపై వేసిన కేసులు ఏళ్లుగడుస్తున్నా విచారణకు నోచుకోవడం లేదని కొందరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. తమకు చెందిన భూములకు మరొకరు పట్టాదారుపాసుపుస్తకాలు చేసుకొన్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇకనైనా తమకు న్యాయం చేయాలని బాధితులు ఆర్డీవోకు విన్నవించుకొన్నారు. బాధితుల నుంచి వచ్చిన కొన్ని ఫిర్యాదులను అప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఆర్డీవో భవాని సంబంధిత మండల తహసీల్దార్‌లకు ఫోన్‌చేసి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు శ్రీనివాసులురెడ్డి, మునస్వామి, శంకరరెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం పలమనేరు ఆర్డీవో పి.భవానికి స్థానిక రెడ్డి సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. స్థానిక రెడ్డి సంఘ అధ్యక్షులు జయరామిరెడ్డి, సలహాదారు అమరనాథరెడ్డి, వెంకటమునిరెడ్డి, నాగరాజరెడ్డి, పెద్దబ్బ, పలువురు రెడ్డి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీతో ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలు

● **వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం**


కుప్పం డిపోలో రికార్డులు పరిశీలిస్తున్న పీఎస్ఎం

కుప్పం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థతో ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం ఆర్టీసీ డిపోను ఆయన సోమవారం సందర్శించారు. రికార్డులు పరిశీలించి, అధికారులతో సమీక్ష జరిపారు. పీఎస్ఎం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు త్వరలోనే ఆధునిక సౌకర్యాలతో కూడిన ఆర్టీసీ బస్టాండును కుప్పం ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. డిపో మేనేజరు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల లైబ్రరీకి దేశభక్తి పుస్తకాల వితరణ

కల్లూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల లైబ్రరీకి సోమవారం సదుంకు చెందిన దాత నాగరాజు దేశభక్తి పుస్తకాలను వితరణగా అందజేసినట్లు హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం లైబ్రరీకి పుస్తకాలు వితరణ చేసిన దాతకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు పాల్గొన్నారు.

● సదుం(ఆంధ్రజ్యోతి): సదుంకు చెందిన ఎన్ఆర్ఐ భవ్య తన అవ్వ వరదమ్మ జ్ఞాపకార్థం పాలమంద జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.7 వేలు విలువజేసే జనరల్ నాలెడ్జ్, దేశభక్తి, నీతి కథల పుస్తకాలను పాఠశాల హెచ్ఎం నిరంజన్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త కలకడ కరీముల్లా, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ కె.నాగరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పేద ప్రజలకు న్యాయం చేసి ఆదుకోండి

సోమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పలు రెవెన్యూ సమస్యలపై అధికారులు స్పందించి పేద ప్రజలకు న్యాయంచేసి ఆదుకోవాలని సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు కోరారు. సోమల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రైతులు తమ ఖాతాలో ఉన్న భూముల వివరాలు వన్‌బీలో రావడం లేదని ఫిర్యాదు చేశారు. అనంతరం వీఆర్వోల సమావేశంలో తహసీల్దార్ వినతులపై సమీక్షించారు. ఎస్‌ఐ శివశంకర్, ఆర్‌ఐ సుబుక్తుల్లా పాల్గొన్నారు.

వందేళ్లుగా నివాసం ఉన్న కుటుంబాలకు నోటీసులు

సోమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వందేళ్లుగా నివాసం ఉన్న కుటుంబాలు ఇళ్లను ఖాళీ చేయాలంటూ నోటీసులు అందడంతో గ్రామస్తులు సోమవారం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నారు. సోమల మండలం వల్లిగట్ల పంచాయతీ అగ్రహారం వడ్డిపల్లె, దళితవాడలో సుమారు 30 కుటుంబాలు కొన్నేళ్లుగా ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నారు. ఇప్పుడు ఆ నివాసభూమి మాభూమి అంటూ చలపతి నాయుడు, రవినాయుడులు శనివారం నోటీలు జారీ చేయించారు. దీంతో ఆకుటుంబాల వారు పోలీసులు, రెవెన్యూ అధికారులను కలసి తమ గోడును చెప్పుకున్నారు. దీంతో తహసీల్దార్ మధుసూదన్, ఎస్‌ఐ శివశంకర కలసి సర్వే చేయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీలోనే కార్యకర్తలకు న్యాయం


చల్లా రామచంద్రారెడ్డిని సత్కరిస్తున్న ఏఎంసీ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి

రొంపిచెర్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలోనే న్యాయం జరుగుతుందని ఆ పార్టీ పుంగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం చల్లా బాబు స్వగృహంలో రొంపిచెర్ల ఏఎంసీ డైరెక్టరుగా ఎంపికైన దేవులపల్లి చెంగల్‌రెడ్డి, చెంచమరెడ్డిగారిపల్లె టీడీపీ నాయకులతో కలిసివెళ్లి చల్లా రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువ కప్పి పూలమాలలతో సత్కరించారు. రైతుల శ్రేయస్సు కోసం తన వంతు పనిచేస్తానని చెంగల్‌రెడ్డి ఈసందర్భంగా అన్నారు. నాయకులు ఎం.రఘునాథ, మాధవ, మనోజ్‌కుమార్, రామ్మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



పుంగనూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థిని జి.పూజిత ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటరమణ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ చంద్రమాకులపల్లెకు చెందిన మదన్‌మోహన్‌రెడ్డి, రేణుక కుమార్తె పూజిత 9వ తరగతి చదువుతోంది. చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో అన్నమయ్యజిల్లా మదనపల్లెలో జరిగిన అండర్ 19 జిల్లా జట్టుకు ఎంపిక కావడంతో విద్యార్థినిని పాఠశాలలో హెచ్ఎం వెంకటరమణ, పీడీ వెంకటరమణ, టీచర్లు జ్యోతి, వెంకటరమణారెడ్డి, రమణమ్మ, మణి, శంకర్‌రెడ్డి, రఘు, సుజాత అభినందించారు.

పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహణ: టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. యువతకు ఇచ్చిన హామీ మేరకు 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించిందని చెప్పారు. ఈ మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి మాజీ సీఎం జగన్ రెడ్డి అనేక అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. అన్నింటినీ దాటుకుంటూ మెగా డీఎస్సీని మంత్రి నారా లోకేష్ పూర్తిచేశారని ప్రశంసించారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఇంజనీర్లు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆర్కిటెక్ట్ అండ్ సివిల్ ఇంజనీర్ల అసోసియేషన్ (సీఏసీఏ), జువారి సిమెంట్ డీలర్ల ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో ఈతరం ఇంజనీర్లు దేశప్రగతికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ ఇంజనీరు ఎంఎన్ సుధాకర్‌ను సన్మానించారు. అసోసియేషన్ కార్యదర్శి విజయశేఖర్, సభ్యులు గుణశేఖర్, శ్రీనివాస బాలాజి, జ్యోతీశ్వరన్, సురేంద్రనాథరెడ్డి, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తొలి ప్రాధాన్యం: జడ్పీ సీఈవో



సమావేశంలో ప్రసంగిస్తున్న రవికుమార్‌నాయుడు

పెనుమూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు ఆదేశించారు. డీపీవో సుధాకరరావుతో కలిసి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆర్థిక సంఘం నిధులను తాగునీటికి ఖర్చు పెట్టాలని, ఆ తర్వాతే మిగతా పనులకు వెచ్చించాలని సూచించారు. అలాగే ఐవీఆర్ఎస్ గ్రామాల్లో చెత్త సేకరణ విధిగా చేపట్టాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ప్రభుకిరణ్ పాల్గొన్నారు.

కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలి: తెలుగు యువత

వెదురుకుప్పం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలని జీడీనెల్లూరు నియోజకవర్గ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి మేళం వెంకటకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కార్వేటినగరం తహసీల్దార్ నాగరాజు, నగరి ఆర్డీవో అనుపమ, చిత్తూరు కలెక్టరేట్‌లో డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రాలిచ్చినట్లు తెలిపారు. ● అలాగే కార్వేటినగరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గౌతంరాజు కూడా తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ లోకేశ్‌యాదవ్‌కి ఇదే అంశంపై వినతిపత్రమిచ్చారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన విద్యుత్ ఉద్యోగులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు సోమవారం నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. తొలి రోజున ఆయా విద్యుత్ కార్యాలయాలకు నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు, కార్మికులు విధులకు హాజరయ్యారు. ఈనెల 22వ తేదీవరకు నిరసన కొనసాగించి, త్వరలోనే ఎస్ఈకి సమ్మె నోటీసు ఇవ్వనున్నారు.

వివాహిత అదృశ్యం

బంగారుపాళ్యం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బలిజపల్లెకు చెందిన హేమచంద్ర భార్య మౌనిక(32) ఆదివారం నుంచి కనిపించడం లేదు. ఈ మేరకు ఆమె భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

పాడి రైతులకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. కోణాపల్లె పంచాయతీలోని నర్రావూరులో పశువులకు జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక నివారణకు టీకాల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అంతకుముందు గ్రామానికి చెందిన పీఈఎస్ విద్యాసంస్థల అధినేత, నర్రావూరు పశువైద్యశాలకు దాత అయిన దివంగత దొరస్వామి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్రావూరు ఏపీ డబ్ల్యూకు సిమెంటు రోడ్డు కావాలని స్థానికులు కోరగా, చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పశుసంవర్ధకశాఖ జేడీ ఆరీఫ్, ఏడీ ఆసిఫ్, వెటర్నరీ ఆస్పత్రి వైద్యుడు మునిచంద్ర, తహసీల్దార్ పార్థసారథి, ఇన్‌చార్జి ఎంపీడీవో వేణు, నాయకులు మురార్జీ యాదవ్, వెంకటేష్ రబీ, చిత్రా నాయుడు, మహబూబ్ బాషా, హరి నాయుడు, హేమయ్య నాయుడు, వల్లేరు అమరనాథ నాయుడు, పీఈఎస్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ కుమారస్వామి నాయుడు, పాడిరైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధితుడికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మురళీమోహన్ సోమవారం చిత్తూరులోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు. రూ.36,86,156 విలువైన చెక్కులను బాధితులకు అందజేశారు. టీడీపీ నాయకులు ఎన్పీ ధరణీనాయుడు, వెంకటేష్ చౌదరి, గిరిధర్ బాబు, మురార్జీ, భాస్కర్ నాయుడు, అమర్‌నాథ్ నాయుడు, వెంకటేష్ రబీ, ప్రతాపనేని చంద్రమౌళి, పారిశ్రామికవేత్త నిత్యానందం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మోక్షం!

బంగారుపాళ్యం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం నుంచి రాగిమానుపెంటకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు రూ.కోటీ 52 లక్షలు మంజూరైందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. సోమవారం చిత్తూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ మేరకు కలెక్టరు సుమిత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చొరవతో రోడ్డు బాగుపడనుందని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే రాగిమానుపెంట వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతుల కోసం కూడా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా, బంగారుపాళ్యం మండలానికి చెందిన ఆరు గురు బాధితులకు రూ.4.63 లక్షల చెక్కులను ఎమ్మెల్యేతో కలిసి ధరణీప్రసాద్ పంపిణీ చేశారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు, బాలకృష్ణమనాయుడు,రమేష్ పాల్గొన్నారు.

హైస్కూల్‌లో కొత్త బోరు డ్రిల్లింగ్‌పై హర్షం



నూతన బోరుకు డ్రిల్లింగ్ ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే థామస్ చొరవతో నెల్లేపల్లె హైస్కూల్‌లో సోమవారం కొత్తబోరు డ్రిల్లింగ్ చేయించడంపై విద్యార్థులు, హెచ్ఎం, టీచర్లు, టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. కొన్ని రోజుల కిందట హైస్కూల్‌కు వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి తాగునీటి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి కొత్త బోరు డ్రిల్లింగ్ చేయడానికి ప్రభుత్వపరంగా మంజూరు చేయించారు. ఈ పనుల ప్రారంభోత్సవంలో టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, సర్పంచ్ గంగయ్యయాదవ్, హెచ్ఎం సుబ్బరత్నమ్మ, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ భువనేశ్వరి, వైస్ చైర్మన్ శ్రీనివాసులు, నేతలు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి: యూటీఎఫ్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి కార్యక్రమం సోమవారం మండల కేంద్రానికి చేరుకుంది. మండల నాయకుడు మహేష్‌బాబు వారికి స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'కు 8 అర్జీలు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలను కమిషనర్ నరసింహ ప్రసాద్ స్వీకరించారు. రెవెన్యూకు నాలుగు, ఇంజనీరింగ్‌కు రెండు, హెల్త్‌కు ఒకటి, టౌన్‌ప్లానింగ్‌కు ఒకటి చొప్పున మొత్తం ఎనిమిది అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎన్నాళ్లీ కష్టాలు..!

● అందుబాటులో ఉండని ఎఫ్ఎన్‌వోలు



బాధితురాలిని స్ట్రెచర్‌పై తీసుకెళ్లడానికి ఇబ్బంది పడుతున్న బంధువులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రి అత్యవసర విభాగంలో రోగులు, వారి బంధువులకు కష్టాలు తప్పడం లేదు. ఏదైనా ప్రమాదంలో గాయపడి 108 అంబులెన్స్‌లో అత్యవసర విభాగం వద్దకు వచ్చిన బాధితులకు సాయం చేయడానికి ఒక్క ఎఫ్ఎన్‌వో కూడా అందుబాటులో ఉండటం లేదు. దీంతో బాధితులను వారి బంధువుల సాయంతో 108 సిబ్బందే ఇబ్బందులుపడి అత్యవసర విభాగంలోకి చేరుస్తున్నారు. ఇక కార్లు, ఆటోల్లో వచ్చేవారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. స్ట్రెచర్ ఎలా వాడాలో తెలియక వారికి మరిన్ని కష్టాలు తప్పడం లేదు. సోమవారం ఉదయం 10.40 గంటల సమయంలో ఓ మహిళ విషం తాగితే ఆమెను ఆటోలో తీసుకొచ్చారు. ఆమెతో వచ్చినవారిలో మహిళలు ఉండటంతో అత్యవసర విభాగానికి తీసుకెళ్లడానికి అక్కడున్న రోగుల బంధువులపై ఆధారపడాల్సి వచ్చింది. కాగా, ఆ సమయంలో ముగ్గురు వైద్యులు అక్కడున్నా రోగిని పట్టించుకోలేదని, జూనియర్ డాక్టర్‌ను పంపించి మిన్నకుండిపోయారని ఈ ఘటనను చూసినవారు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్

సాంబయ్య కండ్రిగ-కట్టమంచి బైపాస్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద తదితరులు

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఆ దిశగానే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. సాంబయ్యకండ్రిగ- కట్టమంచి బైపాస్ రోడ్డుకు సోమవారం వీరు భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. రూ.2.66 కోట్లతో 2.2 కిలోమీటర్ల మేరకు రోడ్డును విస్తరించి, అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ రోడ్డులో అనేక ప్రమాదాలు జరిగాయన్నారు. ఒకటిన్నర నెలలో పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఈ పనులను చేపట్టామన్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ సిస్టం, సెంట్రల్ లైటింగ్ కోసం సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమారరెడ్డి, ఏసీ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్, టౌన్‌బ్యాంకు చైర్మన్ రమేష్‌నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎంపీడీవోకు సన్మానం



ఐరాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐరాల నూతన ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డిని సోమవారం పంచాయతీ కార్యదర్శులు సాదరంగా ఆహ్వానించి, సన్మానించారు. మండల పరిపాలన అధికారి భువనేశ్వరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు



వెదురుకుప్పం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం సీడీపీవో శోభారాణి తనిఖీ చేశారు. ఆమెవెంట సూపర్‌వైజర్ రోజారమణి, అంగన్‌వాడీ వర్కర్ కళ, సహాయకురాలు దీప, మహిళా సంరక్షణ కార్యదర్శి రాజేశ్వరి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

నింద్ర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని నెత్తం కండ్రిగలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఐ నేతలతో కలిసి కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వీధి దీపాలు పది రోజులుగా వెలగడం లేదని, కాలువలు ఏర్పాటుతో పాటు దోమలు మందు పిచికారీ చేయాలని కోరారు. నగరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండయ్య, బాషా, మహేంద్ర, ముత్తు, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. క్షీరసముద్రం బీసీ కాలనీకి చెందిన మునస్వామి భార్య కె.లత(49) శనివారం ఉదయం చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన నడిచి వెళ్తుండగా, పుత్తూరు చెందిన యువరాజు కారులో వస్తూ ఆమెను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడగా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

యాదమరి ఎంపీడీవోగా పెంచల వీరేంద్ర



యాదమరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదమరి ఎంపీడీవోగా పెంచల వీరేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా అల్లూరు డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తూ.. పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

ముగ్గురు కోడిపందెంరాయుళ్ల అరెస్టు

పాలసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కోడిపందెంరాయుళ్లను అరెస్టు చేశారు. నరసింహాపురంలో ఆదివారం రాత్రి కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1200, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు 41-నోటీసు ఇచ్చి ఇంటికి పంపారు. వీరిని మంగళవారంమేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుస్తామని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు.

కాలభైరవ స్వామికి పూజలు

నింద్ర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కాలభైరవ స్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాల భైరవ అష్టమిని పురస్కరించుకుని జరిగిన ఈ పూజలు జరిగాయి.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని పాడి రైతులకు తయ్యూరు పశువైద్యాధికారి శ్రీవిద్య సూచించారు. క్షీరసముద్రం, కొత్తపల్లె, బాలిరెడ్డికండ్రిగ గ్రామాల్లోని పశువులకు ఈ టీకాలను సిబ్బందితో కలిసి వేశారు.

నింద్ర: చవరంబాకం మేళంబాకం గ్రామాల్లోనూ పశువులకు టీకాలు వేశారు. పశువైద్యాధికారులు మునిలక్ష్మీపతి, సాయి సౌందర్య, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆక్రమించిన గుడి భూములు స్వాధీనం చేసుకోండి

● ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామస్తుల ర్యాలీ, ధర్నా



ర్యాలీ, ధర్నా చేస్తున్న ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆక్రమించిన గుడి భూములను స్వాధీనం చేసుకోవాలని ఆలయాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండ గ్రామంలో సిద్దేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు సుమారు 65 ఎకరాల భూమి ఉంది. కొంతమంది వ్యక్తులు ఈ భూములకు పట్టా చేసుకున్నామని, ఎవరికివారు యంత్రాలతో చదును చేసుకోవడాన్ని స్థానికులు గమనించారు. దీనిపై ఆలయాల కమిటీ సభ్యులు, వింజం, బాలగంగనపల్లె పంచాయతీలకు చెందిన ప్రజలు గతంలో అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఆక్రమించిన గుడి భూములను తిరిగి గుడి పేరుతో రికార్డుల్లో ఉంచాలని కొద్దిరోజుల కిందట రెండు పంచాయతీల్లోని ప్రజల సమక్షంలో తీర్మానం చేశారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం పార్టీలకు అతీతంగా రెండు పంచాయతీలకు చెందిన గ్రామస్తులు, హిందూ ధర్మం సంఘ సభ్యులు, రెండు ఆలయాలకు చెందిన కమిటీ సభ్యులు సుమారు 200 మంది కలిసి గంగాధరనెల్లూరు హైస్కూల్ నుంచి బస్టాప్ కూడలివరకు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆలయాలకు ఎంత భూమి ఉందో సర్వేచేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ముందస్తుగా విషయం తెలియడంతో ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున, నరసింగరాయనిపేట ఎస్ఐ నాగసౌజన్య, గంగాధరనెల్లూరు ఏఎస్ఐ మురళీప్రసాద్ తమ సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

డ్రగ్స్ వద్దు బ్రో..!

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో సోమవారం సీతమ్స్ కాలేజీ విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించారు. డ్రగ్స్ సంబంధిత సమాచారం తెలియజేయడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన టోల్‌ఫ్రీ నెంబరు 1972 ఉపయోగాన్ని తెలియజేశారు. తాలూకా ఏఎస్ఐ మురుగేశ్, ఈగల్ టీమ్ హెడ్ గిరిబాబు పాల్గొన్నారు.

అలరించిన 'విజయం' సంగీత కచేరి



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో జరుగుతున్న వరసిద్ధుడి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం చిత్తూరు విజయం సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి సంయుక్త ఆధ్వర్యంలో స్వామివారిపై విద్యార్థులు పలు గీతాలాపనలు చేశారు. వీరిని వైస్ ప్రిన్సిపాల్ అఖిల రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

'టీడీపీ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తా'



మీడియాతో మాట్లాడుతున్న వెంకటేష్ చౌదరి

తవణంపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తానని మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి తెలిపారు. సోమవారం తవణంపల్లెలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రతి సోమవారం పార్టీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె సింగిల్ విండో అధ్యక్షుడు అమరేంద్రనాయుడు, నాయకులు ప్రవీణ్, గిరి నాయుడు, ధనంజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్య ఉచిత శిబిరం

తవణంపల్లె, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అరగొండ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చెన్నైకి చెందిన మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, శంకర నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు నేత్ర వైద్య ఉచిత శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి మురళీకృష్ణ తెలిపారు. అవసరమైన వారికి చెన్నైలోని శంకర నేత్రాలయలో ఉచిత శస్త్ర చికిత్స చేయిస్తామన్నారు.

వైద్యం చేయమంటే ఆధార్‌కార్డు అడుగుతారా?

● ప్రభుత్వాస్పత్రి సిబ్బందిపై నగరవాసి చిందులు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో వైద్యం చేయమని వస్తే ఆధార్‌కార్డు అడుగుతారా? అని నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆస్పత్రి సిబ్బందిపై చిందులు వేశాడు. అనారోగ్యంతో ఉన్న తన భార్యను ప్రభుత్వ ఆస్పత్రికి ఆదివారం రాత్రి తీసుకొచ్చాడు. క్యాజువాలిటీలోని డాక్టర్ ఓపీ తీసుకురావాలని సూచించాడు. ఓపీ కేంద్రానికి వెళ్లగా అక్కడున్న సిబ్బంది ఆధార్‌కార్డు కావాలని కోరారని చిందులు తొక్కాడు. చావుబతుకుల్లో వస్తే ఆధార్‌కార్డు అవసరమా? అని సిబ్బందిపై ఆగ్రహించాడు. అనంతరం తన భార్యకు వైద్యం చేయించుకుని, అరుస్తూ వెళ్లిపోయాడు. దీనిపై ఆస్పత్రి అధికారులను వివరణ కోరగా.. ఆధార్‌కార్డు కావాలని ఆ వ్యక్తిని తాము అడగలేదని తెలిపారు. ఆయన పక్కనే మరో మహిళ అడ్మిషన్ కోసం వస్తే.. ఆమెను ఆధార్ అడిగారని, అతను అపార్థం చేసుకున్నాడని వివరించారు.

పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా చూడండి: యూటీఎఫ్



ఎస్ఆర్‌పురంలో నినాదాలు చేస్తున్న యుటీఎఫ్ నాయకులు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణ అన్నారు. సోమవారం ఎస్ఆర్‌పురంలోని చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. బోధనకు ఆటంకం కల్గించే యాప్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్ మాట్లాడుతూ.. పాత పింఛను విధానం అమలు చేయాలని కోరారు. రాష్ట్ర నాయకురాలు దీనవతి, జిల్లా మహిళ అధ్యక్షురాలు రూప, జిల్లా సభ్యుడు పీతాంబరరెడ్డి, తిరుపతి జిల్లా నేత ఎస్ఎస్ నాయుడు, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం మండల సభ్యులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించే దిశగా ఫైనాన్షియల్ లిటరసీ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. సోమవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘం సభ్యులకు ఆర్థిక అంశాలపై ఫిమేల్ లిటరసీ సీఆర్‌పీలకు శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతల్లో మహిళలకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సాంకేతికను అందిపుచ్చుకునేలా వారికి సలహాలు ఇవ్వాలని, ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండేలా పరిజ్ఞానం పెంచాలన్నారు. డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నివాళి



విజయపురం, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): తెల్లగుంటలో టీడీపీ నాయకుడు వెంకటేసులు నాయుడు మృతి చెందాడు. సోమవారం ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యంనాయుడు, శివయ్యనాయుడు, బెంజిమన్, బాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రైతులకు న్యాయం చేయాలి: తహసీల్దార్

పాలసముద్రం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జరిగిన పొరపాట్లను త్వరగా పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని తహసీల్దార్ అరుణ కుమారి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. డీటీ రిషీవర్మ, ఆర్ఐ దేవి పాల్గొన్నారు.

ప్రాకారోత్సవం



కాణిపాకంలో జరుగుతున్న వరసిద్ధుడి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న ఈవో పెంచలకిషోర్, ఉభయదారులు

భక్తిశ్రద్ధలతో సప్తకన్నికలకు పూజలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లమరాజుపల్లె గుట్టలో సప్తకన్నికలకు పూజలను సోమవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎల్లమరాజుపల్లెతోపాటు పెద్దకాల్వ పంచాయతీకి చెందిన వివిధ గ్రామాలవారు ఈ పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు సప్తకన్నికలకు మొక్కుగా మట్టితో తయారుచేసిన 35జతల ఏనుగులు, గుర్రాలు బొమ్మలను పురుషులు సమర్పించారు. మహిళలైతే అమ్మవార్లకు పొంగళ్లు పెట్టి.. కొత్తచీరలు, జాకెట్లు సమర్పించి, మొక్కులు చెల్లించారు.







మట్టి ఏనుగులు, గుర్రాల బొమ్మలను మోసుకొస్తున్న పురుషులు - పొంగళ్లు తీసుకొస్తున్న మహిళలు - సప్తకన్నికలకు పూజలు చేస్తున్న భక్తులు